పాఠం 15

# చట్టం, న్యాయం - ఒక సన్నివేశ అధ్యయనం

M2J5A3

చట్టాలను ప్రభుత్వాలు చేస్తాయని గత సంవత్సరం మనం చదువుకున్నాం. చట్టాలు అమలు చేయటంలో కార్యనిర్వాహక వర్గం పాత్ర గురించి కూడా క్లుప్తంగా తెలుసుకున్నాం. కానీ చట్టాలను ఉల్లంఘించినప్పుడు ఏమవుతుంది? ఈ అధ్యాయంలో దీని గురించి తెలుసుకుందాం.

### ఆస్తి విషయంలో తగాదా



రవి ఇళ్ల స్థలాల వ్యాపారం చేస్తుంటాడు. భూమి కొని చిన్న చిన్న ప్లాట్లుగా చేసి వాటిని తిరిగి అమ్ముతుంటాడు. దినపత్రిక- లలో ప్లాట్ల గురించి రవి ప్రకటనలు ఇస్తుంటాడు. ప్లాట్లు కొనేవాళ్లు అయిదు సంవత్సరాల పాటు నెలకి 5,000 రూపాయలు చెల్లించాలి.

సాంబ సహకార సంఘంలో నౌకరుగా పని చేస్తున్నాడు. అతడు ఈ ప్రకటనను చూసి ఒక ప్లాటు కొనాలని అనుకున్నాడు. తన జీతంనుంచి డబ్బు పొదుపు చేసి అయిదు సంవత్సరాలపాటు వాయిదాలు కట్టాడు. అయిదు సంవత్సరాల తరవాత సాంబ వాయిదాల ద్వారా తాను కొన్న ప్లాటులో ఇల్లు కట్టుకుందామనుకున్నాడు. అయితే అదే ప్లాటుని కొంతకాలం కిందట మరొక వ్యక్తికి రవి అమ్మాడని అతడికి తెలిసింది.

సాంబ తన కొడుకు క్రాంతితో కలిసి రవి వాళ్ల ఇంటికి వెళ్లాడు. ప్లాటుకి తాను చెల్లించిన డబ్బు తిరిగి ఇవ్వమని రవిని అడిగాడు. ఈ విషయంలో వాగ్వాదం జరిగి రవి సాంబను కొట్టాడు. సాంబ చెయ్యి విరిగింది.

ఈ సంగతి తెలిసి అక్కడ ఒక గుంపు చేరింది. గ్రామ సర్పంచ్ కూడా వచ్చి సాంబ, రవిలను శాంతపరచటానికి ప్రయత్నించాడు. తన తండ్రి సాంబని క్రాంతి దగ్గరలోని పట్టణానికి తీసుకెళ్లాడు, అది మండల ప్రధాన కార్యస్థలం కూడా. సాంబని డాక్టరుకి చూపించి చేతికి కట్టు వేయించాడు. తరవాత డాక్టరు ఇచ్చిన ధృవీకరణ పత్రంతో ఫిర్యాదు చేయటానికి పోలీసు స్టేషనుకి వెళ్లారు.

### ఫిర్యాదు చేయటం

పోలీసు స్టేషనులో రవిపై క్రాంతి ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదులో కింద పేర్కొన్న వివరాలు ఉన్నాయి:

1. పోలీసు స్టేషను అధికారి (ఎస్‌హెచ్‌ఓ)ని సంబోధిస్తూ ఫిర్యాదు రాయబడింది.
2. ఫిర్యాదు వివరాలు.
3. నేరం జరిగిన తేదీ, సమయం, స్థలం.
4. సంఘటన యొక్క వివరణ.
5. నిందితుల పేరు, లింగం, చిరునామా, మొ॥

SCERT TELANGANA



6. సాక్షుల పేర్లు (నేరం ఎవరి సమక్షంలో జరిగింది).
7. విన్నపం (నిందితులను చట్టం ప్రకారం శిక్షించమని కోరటం, తెలిసి ఉంటే వర్తించే సెక్షన్ సంఖ్యను సూచించాలి).
8. ఫిర్యాదుదారు సంతకం, చిరునామా, ఇతర వివరాలు.

ఫిర్యాదులో ఇచ్చిన సమాచారం ప్రకారం పోలీసు స్టేషనులో పోలీసు అధికారి నివేదిక తయారు చేశాడు. దీనిని తొలి సమాచార నివేదిక (ఎఫ్.ఐ.ఆర్.) అంటారు. నివేదిక మీద క్రాంతి సంతకం పెట్టి, ''నివేదికను మీ రిజిస్టరులో నమోదు చేసుకుని మాకు కూడా ఒక ప్రతి ఇవ్వండి,'' అని అడిగాడు. "నివేదికను రిజిస్టరులో రాయటానికి ఎస్‌హెచ్‌ఓగారు వచ్చేవరకు ఆగాలి," అన్నాడు ఆ పోలీసు అధికారి. పోలీసు స్టేషను అధికారిని ఎస్‌హెచ్‌ఓ అంటారు. ఈ పోలీసు స్టేషనులో సబ్‌ఇన్‌స్పెక్టరు (ఎస్ఐ) ఎస్‌హెచ్‌ఓ. ఎస్‌హెచ్‌ఓ వచ్చి నివేదికను రిజిస్టరులో నమోదు చేసేవరకు క్రాంతి అక్కడే ఉన్నాడు.

- ఎస్‌హెచ్‌ఓ/ ఎస్ఐ వచ్చే వరకు వాళ్లు ఎందుకు వేచి ఉన్నారు? ఇటువంటి నివేదిక మీరు రాయాల్సి వస్తే అందులో మీరు ఏమి రాస్తారు?

- పైన ఇచ్చిన దానిబట్టి రవి, సాంబల వివరాలు ఇవ్వండి.
- ఎఫ్.ఐ.ఆర్. ఇచ్చిన వ్యక్తి దాని ప్రతిని తీసుకోవడం ఎందుకు ముఖ్యం?
- ప్రతి పోలీసు స్టేషను కింద కొంత ప్రాంతం ఉంటుంది. మీ ఇల్లు ఏ పోలీసు స్టేషను పరిధిలోకి వస్తుందో తెలుసుకోండి.

### తొలి సమాచార నివేదిక (ఎఫ్.ఐ.ఆర్.)

పోలీసులకు ఫిర్యాదు చేయాల్సి ఉంటే పోలీసు స్టేషనులో తొలి సమాచార నివేదిక (ఎఫ్.ఐ.ఆర్.) ఇవ్వాల్సి ఉంటుంది. ఎఫ్.ఐ.ఆర్ దాఖలు చేసిన తరవాత కేసుని పరిశోధించి, పరిష్కరించాల్సిన బాధ్యత పోలీసులది.

నివేదికలో రాసిన సమాచారాన్ని ఎస్‌హెచ్‌ఓ పైకి చదివి వినిపించాలి. దాంట్లో అన్ని విషయాలు సరిగ్గా ఉంటే ఫిర్యాదుదారు దానిమీద సంతకం చేయాలి. ఎఫ్.ఐ.ఆర్. ఆధారంగా పోలీసు స్టేషనులోని రిజిస్టరులో నేరం వివరాలను పొందుపరచాలి. ఫిర్యాదు చేసిన వ్యక్తి నుంచి ఎటువంటి రుసుము తీసుకోకుండా ఎఫ్ఐఆర్ ప్రతిని అతనికి ఇవ్వాలి.

ఒకవేళ కేసు తీసుకోటానికి ఎస్‌హెచ్‌ఓ తిరస్కరిస్తే నేరుగా డిఎస్‌పి లేదా మెజిస్ట్రేటు దగ్గరకు వెళ్లి ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదును వాళ్లకు పోస్టు ద్వారా కూడా పంపించవచ్చు.

SCERT TELANGANA

## విచారణ, అరెస్టులో పోలీసుల పాత్ర



నేరానికి సంబంధించి ఏ ఫిర్యాదునైనా విచారణ చేయటం పోలీసుల ముఖ్యమైన కర్తవ్యం. విచారణలో భాగంగా రకరకాల రుజువులు సేకరిస్తారు. సాక్షులు చెప్పింది నమోదు చేస్తారు. ఈ విచారణ ఆధారంగా పోలీసులు ఒక అభిప్రాయానికి రావాలి. నిందితుడు దోషి అని సాక్ష్యాలు తెలియ చేస్తున్నాయని పోలీసులు భావిస్తే వాళ్లు న్యాయస్థానంలో చార్జ్‌షీటు దాఖలు చేయాలి. నిందితుడిని శిక్షించే పని పోలీసులది కాదు. నిందితుడు దోషో, కాదో, ఒకవేళ దోషి అయితే ఏ శిక్ష విధించాలో న్యాయమూర్తులు లేదా న్యాయవర్గం నిర్ణయిస్తుంది.

ఈ కేసులో ఎస్.ఐ. ఆ ఊరికి వెళ్లి విచారణ మొదలుపెట్టాడు. ముందుగా సాంబకి అయిన గాయాలు చూశాడు. దెబ్బలు బాగానే తగిలాయని ఆసుపత్రి నివేదిక తెలుపుతోంది. తరవాత అతడు రవి ఇంటి చుట్టుపక్కల ఉంటున్న వాళ్లను విచారించాడు. జరిగిన ఘటన గురించి పూర్తి వివరాలను చుట్టు పక్కలవాళ్లు ఇచ్చారు. సాంబమీద రవి దాడి చేసి, గాయపరిచాడని ఎటువంటి అనుమానానికి తావు లేకుండా స్పష్టమయ్యింది.

అప్పుడు ఎస్.ఐ. రవి వాళ్ల ఇంటికి వెళ్లి సాంబ అనే వ్యక్తిని తీవ్రంగా గాయపరిచిన ఆరోపణపై అతడిని అరెస్టు చేస్తున్నామని ఎస్.ఐ. చెప్పాడు. అతడు రవిని అరెస్టు చేసి మండల పోలీసు స్టేషనుకి తీసుకెళ్లి అక్కడ అతన్ని ప్రశ్నించాడు. సాంబను కొట్టానని రవి ఒప్పుకోలేదు. రవితోటి అతడి నేరాన్ని అంగీకరింప-చేయటానికి ఎస్.ఐ. ప్రయత్నించాడు కానీ అతడు ఒప్పుకోలేదు. మరునాడు మెజిస్ట్రేటు ముందు హాజరుపరచటానికి రవిని పోలీసు లాకప్‌లో నిర్బంధించారు.

- నేరాన్ని ఎవరు విచారించారు, ఎలా విచారించారు?
- 'నిందితుడు' అంటే ఏమిటి? ఈ కథలో నిందితుడు ఎవరు?
- నిందితుడిపై మోపిన ఆరోపణలు ఏమిటి?
- రవిని శిక్షించటానికి ఎస్ఐ అతడిని నిర్బంధించాడని సాంబ అనుకున్నాడు. అది నిజమేనా?

## సివిల్, క్రిమినల్ నేరాలు

మరుసటిరోజు ఎస్.ఐ.తో రవి ఇలా అన్నాడు, *"ప్లాటుకోసం సాంబ కట్టిన డబ్బులు నేను తిరిగి ఇచ్చేస్తాను. ఇక జరిగినదంతా మేము మరిచిపోతాం."*

*"డబ్బు ఎలాగూ తిరిగి ఇవ్వాలి. కానీ ఇప్పుడు నువ్వు సాంబని కొట్టినందుకు అరెస్టు చేశాం. ఇప్పుడు ఇది క్రిమినల్ నేరం అయ్యింది. నువ్వు సాంబని కొట్టి ఉండకపోతే పోలీసులు జోక్యం చేసుకుని ఉండేవాళ్లు కాదు. ప్లాటు ఇవ్వనందుకు నీ మీద సాంబ*

SCERT TELANGANA

సివిల్ కేసు వేసి ఉండేవాడు. అప్పుడు అతనికి ప్లాటు తిరిగి ఇచ్చి, అతడికి జరిగిన నష్టానికి పరిహారం చెల్లించి ఉండేవాడివి. అప్పుడు జైలుకి వెళ్లి ఉండేవాడివి కాదు," అంటూ ఎస్‌ఐ బదులిచ్చాడు.

రవి, సాంబల విషయంలో రెండు రకాల వివాదాలు ఉన్నాయి. మొదటిది, సాంబపై రవి దాడి చేయటం. ఇది క్రిమినల్ నేరం. దొంగతనం, దోపిడీ, కల్తీ, లంచాలు ఇవ్వటం, కల్తీమందులు తయారు చేయటం వంటివి క్రిమినల్ నేరాలకు కొన్ని ఉదాహరణలు. వాళ్లిద్దరి మధ్య సివిల్ వివాదం కూడా ఉంది. సాంబకి రవి ప్లాటు కాని, డబ్బులు కాని ఇవ్వలేదు.

భూమి, ఆస్తి, ఆదాయాలపై ప్రజల హక్కులు, ప్రజల మధ్య ఉన్న సంబంధాలకు సంబంధించినవి సివిల్ వివాదాలు అవుతాయి. క్రిమినల్ వివాదాలలో సాధారణంగా దోషులకు జైలుశిక్ష విధిస్తారు. సివిల్ వివాదాలలో జైలుశిక్ష వేయకపోవచ్చు. క్రిమినల్ కేసులన్నింటిని పోలీసులు చేపడతారు. నేరానికి గురైన వ్యక్తి కాదు. ఇందుకు విరుద్ధంగా సివిల్ వివాదాలలో ఒప్పంద ఉల్లంఘన వల్ల లేదా మోసం వల్ల నష్టపోయామనుకున్న వ్యక్తే స్వయంగా సివిల్ కేసు దాఖలు చేస్తాడు.

క్రిమినల్ కేసులో ప్రభుత్వం చేసిన చట్టం ఉల్లంఘించబడింది కాబట్టి పోలీసులు జోక్యం చేసుకుంటారు. సివిల్ కేసులో ఇద్దరి వ్యక్తుల మధ్య ఒప్పందం ఉల్లంఘన జరుగుతుంది.

- సాంబ ప్లాటుని రవి మరొక వ్యక్తికి అమ్మినపుడు అది .........నేరం (క్రిమినల్ లేదా సివిల్).
- సాంబని రవి కొట్టినప్పుడు అది .........నేరం (క్రిమినల్ లేదా సివిల్).

**క్రిమినల్ (నేర), సివిల్ (పౌర) చట్టాలను అర్థం చేసుకోటానికి కింది పట్టికను చూడండి:**

| సంఖ్య | నేర చట్టం | పౌర చట్టం |
|---|---|---|
| 1 | ఇది నేరంగా పరిగణించే చర్యలకు సంబంధించినది. ఉదాహరణకు దొంగతనం, వరకట్నం తీసుకోవటం, హత్య. | ఇది మరొక వ్యక్తి ఒప్పందాన్ని ఉల్లంఘించటం వల్ల ఒక వ్యక్తికి జరిగే నష్టానికి సంబంధించినది. ఉదాహరణకు అద్దె, సరుకుల కొనుగోలు, విడాకులు. |
| 2 | సాధారణంగా ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి, పోలీసు విచారణతో ఇది మొదలవుతుంది. ఆ తరవాత న్యాయస్థానంలో కేసు వేస్తారు. | నష్టానికి గురైన వ్యక్తి న్యాయస్థానంలో దావా వేయాలి, ఉదాహరణకు అద్దె వివాదంలో యజమాని, లేదా కిరాయిదారు. |
| 3 | దోషి అని రుజువయితే జరిమానాతో పాటు జైలుకి కూడా పంపించవచ్చు. | నష్టానికి గురైన వ్యక్తికి కోర్టు ఉపశమనాన్ని కలిగిస్తుంది, ఉదాహరణకు అద్దె ఇంటినుంచి కిరాయిదారుని ఖాళీ చేయించవచ్చు లేదా కిరాయిదారు నుంచి అద్దె బకాయిలు వసూలు చేయించవచ్చు. |

SCERT TELANGANA

నేర, పౌర చట్టాల గురించి మీరు అర్థం చేసుకున్నదాని ఆధారంగా కింది పట్టికను పూరించండి.

| ఘటన వివరణ | ఏ చట్టం | అనుసరించే విధానం |
|---|---|---|
| బడికి వెళుతున్న దారిలో బాలికల బృందాన్ని ఒక బాలుర బృందం నిత్యం వేధిస్తూ ఉంది | | |
| ఖాళీ చేయమని బలవంతం చేయబడుతున్న కిరాయిదారు ఇంటి యజమానిపై కోర్టులో దావా వేయటం | | |

## బెయిలు

రవిది క్రిమినల్ కేసు కాబట్టి నేరారోపణ పత్రం (చార్జిషీట్) దాఖలు చేసిన తరవాత లాకప్‌లో నిర్బంధించారు. క్రిమినల్ కేసులలో నిందితులను జైలులో ఉంచుతారు. అయితే ఇది శిక్షకాదు. ఇది నేర విచారణలో దోహదపడటానికి, లేదా నిందితుడు సాక్ష్యాలను కనుమరుగు చేయకుండా ఉండటానికి, లేదా సాక్షులను బెదిరించకుండా ఉండటానికి ఉద్దేశించినది. పోలీసు లాకప్‌లో కొన్ని రోజులు ఉన్న తరవాత రవి కుటుంబం బెయిలు కోసం న్యాయ స్థానంలో దరఖాస్తు చేసుకుంది. హత్య, లంచగొండితనం, దోపిడీ వంటి నేరాలు మోపబడిన వ్యక్తికి బెయిలు దొరకకపోవచ్చు. బెయిలు పొందటానికి న్యాయ స్థానంలో కొన్ని హామీలు ఇవ్వాలి. ఈ హామీ ఆస్తులు కావచ్చు లేదా పూచీకత్తుగా నిలబడే వ్యక్తి కావచ్చు, బాండు కావచ్చు. అడిగినప్పుడు న్యాయ స్థానంలో నిందితుడు హాజరు అవుతాడని బాండు హామీ ఇస్తుంది. బెయిలు మంజూరు చేయాలో, లేదా నిరాకరించాలో న్యాయస్థానంలో న్యాయమూర్తి నిర్ణయిస్తారు.

### నిందితుని హక్కుగా బెయిలు

బెయిలు నిందితుని హక్కు, నేర తీవ్రతను బట్టి, సాక్షులను బెదిరించటానికి ఉన్న అవకాశాన్ని బట్టి దాన్ని మంజూరు చేస్తారు. అదే సమయంలో నిందితుడిని విడుదల చేస్తే సమాజానికి, సాక్షులకు, ఫిర్యాదుదారునికి ఏమైనా హాని జరుగుతుందేమో న్యాయస్థానం పరిశీలిస్తుంది. బెయిలు ఇవ్వగలిగిన నేరాలలో ఎస్‌హెచ్‌ఓ మాత్రమే బెయిలు మంజూరు చేస్తారు. బెయిలు లేని నేరాలలో నిందితుడు సంబంధిత న్యాయస్థానంలో బెయిలు కోసం దరఖాస్తు చేసుకోవాలి.

న్యాయస్థానంలో రవి లేదా సాంబల కేసును న్యాయవాదులు వాదిస్తారు. రవి సొంతంగా న్యాయవాదిని ఏర్పాటు చేసుకోవాలి. కానీ సాంబ తరఫున ప్రభుత్వ న్యాయవాది (పబ్లిక్ ప్రాసిక్యూటర్) వాదిస్తాడు. న్యాయ విధానాలు చాలా సంక్లిష్టమైనవి, వాటి గురించి చర్చించటానికి ప్రత్యేక అవగాహన ఉండాలి.

### ప్రభుత్వ న్యాయవాది పాత్ర

క్రిమినల్ నేరాన్ని ప్రజలపట్ల జరిగిన అపరాధంగా నమోదు చేస్తారు. అంటే ఈ నేరం అన్నది బాధితుల పట్లే కాకుండా సమాజంపట్ల జరిగిందని భావిస్తారు.

న్యాయస్థానంలో ప్రభుత్వ న్యాయవాది ప్రభుత్వ ప్రయోజనాలకు ప్రతినిధిగా ఉంటాడు. పోలీసులు విచారణ చేసి న్యాయస్థానంలో నేరారోపణ పత్రం దాఖలు చేసిన తరవాత ప్రభుత్వ న్యాయవాది పాత్ర

SCERT TELANGANA

మొదలవుతుంది. విచారణలో ప్రభుత్వ న్యాయవాది పాత్ర ఏమీ ఉండదు. అతడు/ ఆమె ప్రభుత్వం తరఫున వాదనలు చేపట్టాలి. న్యాయస్థానం అధికారిగా అతడు/ ఆమె నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ, సాక్షులను, రుజువులు/ ఆధారాలను న్యాయస్థానం ముందు ఉంచి కేసుపై నిర్ణయం తీసుకోటానికి సహకరించాలి.

## న్యాయమైన విచారణ

సాంబ, రవిల కేసు జ్యుడిషియల్ మెజిస్ట్రేటు న్యాయస్థానంలో విచారింపబడుతోంది. న్యాయస్థానం లోపల, బయట నల్లని దుస్తులు ధరించిన న్యాయవాదులు, విచారణకు సంబంధించిన ప్రజలు, ఇంకా ఇతరులు చాలామంది ఉన్నారు.

చట్టం ముందు అందరూ సమానులే అని చట్టం చెబుతోంది. ఒకరు దోషులో కాదో నిర్ణయించటానికి అతడు/ ఆమెపై న్యాయమైన, నిష్పాక్షికమైన బహిరంగ విచారణ జరుపుతారు. నేర విచారణ 'అమాయకులు అన్న భావన'తో మొదలవుతుంది, ఎటువంటి అనుమానానికి తావులేకుండా నేరం నిరూపింపబడాలి.

సాంబ గాయపడ్డాడు కాబట్టి రవి నేరస్తుడన్న నిర్ణయానికి న్యాయమూర్తి రాలేదు. రవి వల్లనే అతడికి గాయాలయ్యాయని నిరూపింపబడాలి.

- న్యాయమైన విచారణ అంటే ఏమిటి? అది అవసరమా? ఎందుకు? చర్చించండి.

## మొదటి వాయిదా, న్యాయవాది

జ్యుడిషియల్ మెజిస్ట్రేటు కోర్టులో సాంబ, అతడి కొడుకు క్రాంతి, రవి, ఎస్.ఐ. ఉన్నారు. రవి ఒక న్యాయవాదిని పెట్టుకున్నాడు. ప్రభుత్వం తరఫున ప్రభుత్వ న్యాయవాది (పబ్లిక్ ప్రాసిక్యూటర్) కేసును ప్రవేశపెట్టాడు.

చాలాసేపు వేచి ఉన్న తరవాత రవి, సాంబలను విచారణకు పిలిచారు. జ్యుడిషియల్ మెజిస్ట్రేటు ముందు ఇదే మొదటి వాయిదా.

ఎఫ్.ఐ.ఆర్. ప్రతిని, పోలీసుల నివేదికను రవి న్యాయవాదికి ఎస్.ఐ. ఇచ్చాడు. దీనివల్ల తన క్లయింటుపై మోపబడిన ఆరోపణలు ఏమిటో అతడికి తెలుస్తాయి. ఈ నివేదికల ద్వారా రవికి వ్యతిరేకంగా పోలీసులు సేకరించిన సాక్ష్యాలు ఏమిటో కూడా అతడికి తెలుస్తాయి. ఈ కేసులో నిందితుడైన రవి తరఫున అతని న్యాయవాది వాదించటానికి ఇదంతా దోహదపడుతుంది.

తీవ్రంగా గాయపరిచాడంటూ రవిపై జ్యుడిషియల్ మెజిస్ట్రేటు మొదటి వాయిదాలో నేరారోపణ చేశాడు. ఈ నేరం రుజువైతే 4 సంవత్సరాల దాకా జైలుశిక్ష పడవచ్చు. రవి నేరాన్ని అంగీకరించలేదు. దాంతో మెజిస్ట్రేటు తరవాత విచారణను 15 రోజులకు వాయిదా వేశాడు.

- రవి కేసును ఏ న్యాయస్థానం విచారిస్తోంది?
- మొదటి వాయిదాలో ఏమయ్యింది?
- ప్రభుత్వం తరఫున వాదించే న్యాయవాదిని ఏమంటారు?



SCERT TELANGANA

## న్యాయమూర్తి పాత్ర ఏమిటి?

న్యాయమూర్తి ఆటలో అంపైర్ వంటివాడు. అతడు విచారణను నిష్పక్షపాతంగా, బహిరంగంగా నిర్వహిస్తాడు. సాక్షులు అందరూ చెప్పేది, వాది, ప్రతివాది అందించే రుజువులను న్యాయమూర్తి పరిశీలిస్తాడు. తన ముందు ఉంచిన సాక్ష్యాల ఆధారంగా, నేరం ఆరోపించబడిన వ్యక్తి చట్టం ప్రకారం దోషో, కాదో న్యాయమూర్తి నిర్ణయిస్తాడు. నిందితుడు దోషి అని నిరూపింపబడితే శిక్ష విధిస్తూ తీర్పు వెలువరిస్తాడు. చట్టం ఏం చెబుతోంది అన్నదానిబట్టి అతడికి జైలుశిక్ష వేయవచ్చు లేదా జరిమానా విధించవచ్చు లేదా రెండూ విధించ వచ్చు.

## అధికారాల మధ్య విభజన, స్వతంత్రత

ఇంతకు ముందు అధ్యాయాలలో మనం భారతదేశ రాజ్యాంగం గురించి చదువుకున్నాం. రాజ్యాంగంలో ముఖ్యమైన అంశం కార్యనిర్వాహక, న్యాయ, శాసన అధికారాలను వేరుచేయటం. దీని అర్థం ఒక శాఖలో మిగిలిన శాఖలు – అంటే ఉదాహరణకు న్యాయ శాఖలో శాసన, కార్యనిర్వాహక శాఖలు జోక్యం చేసుకోలేవు. న్యాయస్థానాలు ప్రభుత్వ ఆధీనంలో లేవు. ప్రభుత్వం తరఫున పని చేయవు.

పోలీసులు కూడా న్యాయశాఖలో భాగం కాదు. వాళ్లు కార్యనిర్వాహక శాఖకు చెందినవాళ్లు. గత సంవత్సరం మీరు జిల్లాస్థాయి పరిపాలన గురించి చదివారు. జిల్లాస్థాయిలో కలెక్టరు మాదిరిగా శాంతి భద్రతల నిర్వహణకు జిల్లాస్థాయి ప్రభుత్వ పోలీసు అధికారి ఉంటాడు. రాష్ట్ర ప్రభుత్వంలోని హోం మంత్రిత్వశాఖ కింద పోలీసు శాఖ పనిచేస్తుంది.

పై విభజన బాగా పనిచేయటానికి హైకోర్టు, సుప్రీంకోర్టులకు చెందిన న్యాయమూర్తులను ప్రభుత్వంలోని ఇతర అంగాల జోక్యం లేకుండా నియమించాలి. ఒకసారి నియమించిన తరవాత న్యాయమూర్తిని తొలగించటం చాలా కష్టం.

- తీర్పును ప్రభావితం చేయడంలో రాజకీయ నాయకులకు ఏమైనా ఆస్కారం ఉందా? ఎందుకని?
- స్వతంత్ర న్యాయ వ్యవస్థ అంటే ఏమిటి?
- మీ ప్రాంతంలో ఒక పెద్ద కంపెనీ అడవిని నరికివేస్తోందనీ, ఒక గిరిజనుడు కట్టెపుల్లల కోసం కొమ్మలు నరుకుతున్నాడని ఊహించుకోండి. దీనిపై చర్చించండి.

## సాక్షుల రుజువులు

తన తరఫున సాక్షులుగా రవి కొంతమంది మిత్రుల పేర్లు ఇచ్చాడు. సాంబ తరఫున ఎఫ్.ఐ.ఆర్. దాఖలు చేసిన అతడి కొడుకు క్రాంతి కూడా కొంతమందిని సాక్షులుగా పేర్కొన్నాడు. ఎస్.ఐ. తన విచారణ సమయంలో రవి పక్క ఇళ్లల్లో ఉంటున్న ఇద్దరి పేర్లను సాక్షులుగా రాసుకున్నాడు. కేసు రెండవ వాయిదా నాటికి న్యాయస్థానంలో హాజరు కావలసిందిగా ఈ సాక్షులందరికీ మెజిస్ట్రేటు నుంచి సమన్లు అందాయి.

15 రోజుల తరువాత సంబంధిత వ్యక్తులందరూ న్యాయస్థానానికి వచ్చారు. చాలాసేపు వేచి ఉన్న తరవాత ఈ కేసు విచారణ మొదలయ్యింది. ముందుగా ప్రభుత్వం తరఫున సాక్షిగా ఉన్న మహిళను పిలిచారు. నేరం జరిగిన రోజున ఘటనల క్రమాన్ని ఆమె వివరించింది. ప్రభుత్వ న్యాయవాది, రవి తరఫున న్యాయవాది ఆమెను అనేక ప్రశ్నలు అడిగారు. మరో ముగ్గురు సాక్షులు చెప్పింది మెజిస్ట్రేటు విని వాళ్ల సాక్ష్యాలను నమోదు చేశాడు. తరవాత విచారణను మరో రోజుకి వాయిదా వేశాడు. ఈ విధంగా ప్రతిసారీ విచారణలో ఒకరిద్దరు సాక్షులను విచారించి కేసును మరో రోజుకు వాయిదా వేసేవారు.

విచారణ అనేక నెలలపాటు కొనసాగింది. తన న్యాయవాదికి రవి డబ్బులు చెల్లించాల్సి వచ్చింది. న్యాయస్థానానికి వెళ్లి, రావటానికి కూడా ఖర్చు

SCERT TELANGANA

అయ్యేది. అతడి వ్యాపారం కూడా దెబ్బతిన్నది. ఒక సంవత్సరం గడిచింది. చివరికి రవి దోషి అని న్యాయమూర్తి తీర్పు ఇచ్చి 4 సంవత్సరాల జైలుశిక్ష విధించాడు.

- ఏ కేసులోనైనా సాక్షులు చెప్పేవాటిని వినాల్సిన అవసరం ఏమిటో చర్చించండి.


### అప్పీలు విధానం

తీర్పు పట్ల రవి చాలా అసంతృప్తి చెందాడు. తాను జైలులో ఉంటే తన కుటుంబం ఏమైపోతుందోనని అతడు ఆందోళన చెందాడు. కిందిస్థాయి న్యాయస్థానం ఇచ్చిన తీర్పుతో ఎవరైనా అసంతృప్తి చెందితే పై న్యాయస్థానంలో అప్పీలు చేసుకోవచ్చు.

మన దేశంలో మూడు స్థాయిలలో న్యాయస్థానాలు ఉన్నాయి. కింది స్థాయిలో అనేక న్యాయస్థానాలు ఉన్నాయి. చాలా మంది ప్రజలు ఆశ్రయించే న్యాయస్థానాలను సబార్డినేట్ లేదా జిల్లా న్యాయస్థానాలు అంటారు. ఇవి సాధారణంగా జిల్లా లేదా డివిజనల్ స్థాయిలోనో లేదా పట్టణాల్లోనో ఉంటాయి. ఇవి అనేక రకాలైన కేసులను విచారిస్తాయి. ప్రతి రాష్ట్రంలో ఆ రాష్ట్రానికి అత్యున్నతమైన హైకోర్టు ఉంటుంది. దేశంలో అత్యున్నతమైన సుప్రీంకోర్టు కొత్త ఢిల్లీలో ఉంది. దీనికి అధిపతిగా భారత ప్రధాన న్యాయమూర్తి ఉంటారు. సుప్రీంకోర్టు తీసుకునే నిర్ణయాలను భారతదేశంలోని మిగిలిన అన్ని కోర్టులు కట్టుబడి ఉండాలి.

- మీ టీచరు సహాయంతో మీ ప్రాంతానికి సంబంధించి ఈ న్యాయస్థానాలు ఎక్కడ ఉన్నాయో తెలుసుకోండి.
- కిందినుంచి పైవరకు న్యాయస్థానాల వ్యవస్థ పిరమిడ్ ఆకారాన్ని పోలి ఉంది. దీనికి సంబంధించిన సమాచారాన్ని ఒక బొమ్మలో నింపండి.

SCERT TELANGANA



### సెషన్స్ కోర్టులో అప్పీలు

జిల్లా ముఖ్యస్థానంలోని సెషన్స్ కోర్టులో అప్పీలు చేయమని రవికి అతడి తరపున న్యాయవాది సలహా ఇచ్చాడు: "*అప్పీలు చేసే పని నాకు వదిలిపెట్టండి. అయితే దీనికి అదనంగా నాకు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. కింది న్యాయస్థానం నిర్ణయాన్ని మార్చే అధికారం ఈ న్యాయస్థానానికి ఉంటుంది. నీ శిక్షను ఈ న్యాయస్థానం తగ్గించవచ్చు.*"

అయితే రవి ఆందోళన తగ్గలేదు. కేసులో తరచు హాజరు కావలసిన వాయిదాల గురించి అతడు ఆలోచిస్తున్నాడు. "*జిల్లా ప్రధాన కేంద్రం చాలా దూరంగా ఉంది. సాక్షులందరితో అంతదూరం వెళ్లి రావటం చాలా ఖర్చుతో కూడుకున్నది. అంత ఖర్చు భరించటం ఎలా?*" అని అతడు అన్నాడు. సెషన్స్ కోర్టులో రవి ఒకటి, రెండు వాయిదాలకు హాజరైతే సరిపోతుందని, మిగిలిన విచారణ అంతా దస్త్రం ఆధారంగా నడుస్తుందని అతని న్యాయవాది చెప్పాడు.

అతడి తరపున రవి న్యాయవాది సెషన్స్ కోర్టులో అప్పీలు వేశాడు. జ్యుడిషియల్ మెజిస్ట్రేటు ఇచ్చిన తీర్పును సెషన్స్ కోర్టు నిలుపుదల చేసింది. దీని అర్థం రవి వెంటనే జైలుకి వెళ్లాల్సిన అవసరం లేదు. సెషన్స్ కోర్టుకి రవి ఒక్కసారి హాజరైతే సరిపోతుంది. సాంబ, అతడి తరపున సాక్షులు హాజరు కావలసిన పనిలేదు. మిగిలిన వాయిదాలను న్యాయవాది చూసుకున్నాడు. తీర్పు చెప్పటానికి సెషన్స్ కోర్టు రెండు సంవత్సరాలు తీసుకుంది. రవిని దోషిగా నిర్ధారించింది. కానీ శిక్షను సంవత్సరానికి తగ్గించింది.

- రవి శిక్షను సెషన్స్ కోర్టు తగ్గించటానికి కారణాలను ఊహించండి.

### హైకోర్టు

సెషన్స్ కోర్టు ఇచ్చిన తీర్పుతో కూడా రవి సంతోషించలేదు. ఈ కోర్టులో నిర్ణయాలపై రాష్ట్రంలోని అత్యున్నతస్థాయి న్యాయస్థానమైన హైకోర్టులో అప్పీలు చేయవచ్చని న్యాయవాది సలహా ఇచ్చాడు. నిందితులను కానీ, సాక్షులను కానీ హైకోర్టు పిలవదు. కేసుకి సంబంధించిన దస్త్రం ఆధారంగా అది నిర్ణయాలు తీసుకుంటుంది. "నీకు పడిన శిక్షను ఇంకా తగ్గించుకోవడానికి హైకోర్టులో అప్పీలు చేసుకోవాలని కోరుకుంటే నేను ఈ కేసును హైకోర్టులో వేయగలను" అని న్యాయవాది చెప్పాడు.



*చిత్రం 15.1: తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు*

SCERT TELANGANA

రవి తన న్యాయవాదికి మరికొంత ఫీజు ఇచ్చి హైకోర్టులో అప్పీలు దాఖలు చేయమన్నాడు. అప్పీలు చేసి, కొన్ని నెలలపాటు విచారణ జరిగిన తరవాత సెషన్స్ కోర్టు నిర్ణయాన్ని నిర్ధారిస్తూ హైకోర్టు తన తీర్పును ఇచ్చింది. అంటే రవి హైకోర్టులో ఓడిపోయాడు, సెషన్స్ కోర్టు విధించిన శిక్షను అనుభవించాలి.

ఇప్పుడు రవి ముందు రెండు మార్గాలు ఉన్నాయి: మొదటిది జైలుశిక్ష అనుభవించటం, రెండవది సుప్రీం కోర్టులో అప్పీలు చేయటం. ఈ మొత్తం వ్యవహారంతో రవి బాగా అలసిపోయాడు, విసిగిపోయాడు. దాంతో రవి వ్యవహారం హైకోర్టుతో ముగిసింది.

- నిందితులను కానీ, సాక్షులను కానీ హైకోర్టు తన ముందుకు రమ్మని అడగదు. ఎందుకని?
- "మా నాన్నకి న్యాయం జరిగింది, కానీ చాలా ఆలస్యం అయ్యింది," అని క్రాంతి అన్నాడు. మీరు అతడితో ఏకీభవిస్తారా?

ఇంతవరకు మనం రవి, సాంబాల మధ్య జరిగిన తగాదాలు, వారు ఎవరెవరిని ఆశ్రయించి ఎలాంటి న్యాయం పొందారో ఫిర్యాదు చేయటం, నమోదు చేయటం, విచారణ చేయటం వంటి న్యాయ ప్రక్రియలను గూర్చి తెలుసుకున్నాం కదా! పిల్లల భద్రత విషయంలో వారు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించుటకు కూడా ప్రత్యేక కోర్టులు ఉన్నవి. అవి పెద్దల కోర్టులకు పూర్తి భిన్నంగా పనిచేయుచున్నవి.

భారత ప్రభుత్వం పిల్లల ఆసక్తులను, భద్రతను పరిరక్షించుటకు ఒక ప్రత్యేక చట్టం తయారు చేసింది. అదే బాలలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం–2012. (POCSO Act.-2012) ఈ చట్టం పిల్లల పట్ల లైంగిక వేధింపులను నిరోధిస్తుంది. కావున పిల్లలకు ఇలాంటి సమస్యలు ఎదురైనప్పుడు తక్షణమే తల్లిదండ్రులకు తెలియజేయాలి. తల్లిదండ్రులు, పోషకులు పోలీసులకు (Special Juvenile Police Unit) లేదా 1098 కు కాల్ చేయాలి. ప్రత్యేక బాలనేరస్థుల పోలీసు విభాగం ప్రతిజిల్లాలో ఉంటుంది. ప్రత్యేక కోర్టులు ఈ సమస్య పరిష్కారానికై నియామకమైన న్యాయమూర్తులు బాధిత బాలల వాంగ్మూలానికి అధిక ప్రాధాన్యతనిస్తారు.

## కీలకపదాలు

| | | | |
|---|---|---|---|
| 1. నిందితుడు | 2. ఎఫ్ఐఆర్ | 3. నేరం | 4. విచారణ |
| 5. అరెస్టు | 6. సమన్లు | 7. సాక్షి | 8. న్యాయవిచారణ |
| 9. తీర్పు | 10. అప్పీలు/ అభ్యర్థన | 11. ఒప్పంద ఉల్లంఘన | 12. క్లయింటు |
| 13. ప్రభుత్వ న్యాయవాది | | 14. బెయిలు | 15. మెజిస్ట్రేటు |
| 16. బాధితులు | | | |

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

M4M7N9

1. తప్పు వాక్యాలను సరిచేయండి:
   - ఎఫ్ఐఆర్‌ను కోర్టులో దాఖలు చేస్తారు.
   - పోలీసులు అరెస్టు చేయటమంటే శిక్షింపబడటంతో సమానం.
   - హామీల ఆధారంగా బెయిలు మంజూరు చేస్తారు.
   - దేశంలో అత్యున్నత కోర్టు సుప్రీం కోర్టు.

SCERT TELANGANA

2. రవి విషయంలో మొదటి విచారణ నుంచి హైకోర్టులో తుది తీర్పు వరకు ఏం జరిగిందో ఈ పట్టికలవివరించండి.

| సాక్షుల పాత్ర | ఇచ్చిన శిక్ష | రవి హాజరుకావలసిన అవసరం |
|---|---|---|
| | | |

3. క్రిమినల్, సివిల్ కేసుల మధ్య తేడాల దృష్ట్యా వీటి గురించి ఒక్కొక్క వాక్యం రాయండి:

   (అ) శిక్ష, జైలు

   (ఆ) ప్రభుత్వ న్యాయవాదులు

   (ఇ) ఎఫ్.ఐ.ఆర్. నమోదు

4. హైకోర్టు నిర్ణయాన్ని సెషన్స్ లేదా జిల్లా కోర్టు మార్చగలవా? ఎందుకు?
5. సెషన్స్ కోర్టు, హైకోర్టు తీర్పులతో ఎవరైనా సంతృప్తి చెందకపోతే వాళ్లు ఏం చేయవచ్చు?
6. ఎస్.హెచ్.ఓ, మెజిస్ట్రేట్‌ల పాత్రలలో తేడాలు ఏమిటి?
7. మీ అభిప్రాయంలో రవి విషయంలో తీర్పు ఎలా ఉండాలి?
8. ఒక వ్యక్తి పోలీసు స్టేషనులో తన నేరాన్ని ఒప్పుకున్నాడు. పోలీసులు అతడిని ఆరు నెలలపాటు నిర్బంధంలో ఉంచారు. ఇది సరైన విధానమేనా? మీ సమాధానానికి కారణాలు పేర్కొనండి.
9. పిల్లల పట్ల పెద్దల ప్రవర్తన ఎలా ఉండాలి? భద్రత దృష్ట్యా కొన్ని సూచనలు చేయండి?
10. నిన్ను ఒకరు వేధిస్తున్నారని ఊహించుకోండి. దానికి సంబంధించి అన్ని వివరాలను పొందుపరుస్తూ పోలీస్ అధికారికి ఫిర్యాదు రాయండి.

**చర్చ :**

1. గ్రామాలలో/కుటుంబాలలో తరచు తగాదాలు ఎందుకు వస్తాయి? దానికి కారణాలు ఏవి? అవి రాకుండా ఉండాలంటే మన ప్రవర్తనలో ఎలాంటి మార్పు రావాలి?
2. నేరాలు చేసి జైలుకు వెళ్ళిన వారి కుటుంబాల పరిస్థితులపై చర్చించండి. అలాంటి వ్యక్తులను పిలిచి, తరగతి గదిలో జైలు జీవితం, స్వేచ్ఛపై మాట్లాడండి.
3. పోలీసు ఆఫీసర్‌ను గాని, న్యాయవాదిని గాని తరగతి గదికి ఆహ్వానించి వివిధ రకాల నేరాలు, వాటి శిక్షలు గురించి మరియు నేరస్తులుగా మారకుండా ఎలా నడుచుకోవాలో చర్చించండి.

SCERT TELANGANA

**ప్రాజెక్టు:**

శాంతి నగరం అనే పట్టణం ఉంది. దానికి 40 కిలోమీటర్ల దూరంలోని పట్టణంలో ఫియస్టా, జుబిలీ అనే ఫుట్‌బాల్ టీముల మధ్య తుది పోటీ జరగాల్సి ఉంది. అయితే మరునాడు మైదానాన్ని జుబిలీ బృందం మద్దతుదారులు పాడుచేశారని తెలిసింది. శాంతి నగరంలో ఫియస్టా మద్దతుదారులు జుబిలీ మద్దతుదారుల ఇళ్లపై మారణాయుధాలతో దాడి చేశారు. ఈ దాడిలో 10 మంది పురుషులు చనిపోయారు, అయిదుగురు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. చాలా ఇళ్లు ధ్వంసమయ్యాయి. 50 మందికి పైగా ప్రజలు గాయాల పాలయ్యారు.

మీరు, మీ మిత్రులు నేర న్యాయవ్యవస్థలో భాగమని ఊహించుకోండి. ముందుగా తరగతిలోని విద్యార్థులను ఈ కింది రకంగా విభజించండి.

1. పోలీసు
2. ప్రభుత్వ న్యాయవాది
3. నిందితులతరపు న్యాయవాది
4. న్యాయమూర్తి

పాఠం నుండి ప్రతి జట్టు చేయవలసిన విధులను, ఫియస్టా అభిమానులచే హింసకుగురైన బాధితులకు న్యాయం జరిగేలా కేటాయించండి. ఈ విధులు ఏ క్రమంలో పూరించాలో సూచించండి.

- ఇదే పరిస్థితిని తీసుకుని ఫియస్టా ఫుట్‌బాల్ జట్టు అభిమానియైన ఒక విద్యార్థిని పైవిధులన్నీ నిర్వర్తించమనండి. నేర న్యాయవ్యవస్థలోని అన్ని విధులూ ఒక్కరే నిర్వర్తించినప్పుడు బాధితులకు న్యాయం జరుగుతుందా? మీ సమాధానానికి కారణాలు పేర్కొనండి.
- నేర న్యాయవ్యవస్థలో వివిధ పాత్రలను వివిధ వ్యక్తులు పోషించాలనటానికి రెండు కారణాలను పేర్కొనండి.

SCERT TELANGANA